క్లుప్తంగా

ఘనంగా స్వయంపాలన



స్వయంపాలనలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం ఇంద్రానగర్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా బోధనలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సిబ్బంది అభినందించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఉదయ్‌కుమార్, పీఎస్ హెచ్ఎం రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాలని వినతి



మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య

షాబాద్: ఇందిరమ్మ ఇళ్లు, స్థలాలకు పట్టాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పేర్కొన్నారు. బుధవారం నగరంలోని సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్ల కేటాయింపులో పేదలకు న్యాయం చేయాలని కోరారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేవిధంగా చూడాలన్నారు.

కేన్సర్‌పై అవగాహన పెంచుకోవాలి

నేపాల్ లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ త్రిజా ధకల్

మొయినాబాద్: కేన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని నేపాల్ లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ త్రిజా ధకల్ అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కేన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. కేన్సర్ మనిషిలోని అవయవాల్లో అదనంగా పుట్టుకొస్తుందన్నారు. ఎప్పటికప్పుడూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా కేన్సర్‌ను మొదటి దశలోనే గుర్తించవచ్చన్నారు. మొదటి దశలో గుర్తిస్తే నివారించడం సులభమవుతుందన్నారు. ఈ విషయాన్ని విద్యార్థులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. కార్యక్రమంలో ముంబాయి లయన్స్ క్లబ్ మెంబర్ ఉదయశ్రీ, అరిస్టాటిల్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, కేజీరెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ సాయిసత్యనారాయణరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం



బాధితుడికి చెక్కు అందజేస్తున్న నాయకులు

నందిగామ: నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహాయాదవ్ అన్నారు. మండల కేంద్రమైన నందిగామలో అదే గ్రామానికి చెందిన మంగలి శ్రీనివాస్‌కు సీఎం ఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.15వేల చెక్కును నర్సింహాయాదవ్ బుధవారం బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు కొమ్ము కృష్ణ, దేపల్లి కుమార్‌గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ నర్సింలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న జీపీ కార్మికులు

కేశంపేట: గ్రామ పంచాయతీ కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులను కలిసినా సమస్యలు పరిష్కారం కావడం లేదని తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచంద్రయ్య అన్నారు. ఇందిరా పార్కులో ధర్నా కోసం పర్మిషన్ తీసుకున్న తర్వాత పోలీసులు కార్మికులను ఎక్కడికక్కడ అరెస్టులు చేశారని ఆయన ఆరోపిస్తూ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కార్మికుల పట్ల నియంతృత్వ ధోరణి వదిలి తమకు న్యాయం చేయాలని అయన ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో పారేష, రవి, పద్మమ్మ, జంగయ్య, రవి, భిక్షమయ్య, రాములు పాల్గొన్నారు.



వ్యాయామం.. రక్షణ కవచం

షాద్‌నగర్: చలి తీవ్రత పెరుగుతున్నా కొద్దీ జాగ్రత్తలు తప్పనిసరి. ముఖ్యంగా అందరూ పౌష్టికాహారాన్ని తీసుకోవాలి. ఓట్స్ తింటే ఫైబర్‌తో పాటు శరీరానికి ప్రోటీన్లు అందిస్తుంది. అల్పాహారంలో దోశ, ఇడ్లీతో పాటు చిరుధాన్యాలు తింటే ఎంతో మేలు. రాత్రి భోజనాన్ని త్వరగా తినాలి. జొన్న, గోధుమ రొట్టెలు తినొచ్చు. వీటితో పాటుగా ఆకుకూర పప్పు, కూరగాయలు లాంటివి శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. రాత్రి తీసుకునే ఆహారం తేలిగ్గా ఉంటే నిద్రకు ఆటంకం ఉండదు. దాహం తక్కువగా వేస్తుంది. అలా అని నీరు తాగకుండా ఉండొద్దు. గోరువెచ్చని నీరు తాగడం ఉత్తమం. పౌష్టిక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడంతో పాటు వ్యాయామం చేయాలి.

– డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సూపరింటెండెంట్, ప్రభుత్వ ఆస్పత్రి, షాద్‌నగర్



మున్సిపాలిటీగా మొయినాబాద్!

ప్రతిపాదనలు పంపిన అధికారులు

- ప్రభుత్వ ఆమోదమే తరువాయి
- ఎదురుచూస్తున్న ఆయా గ్రామాల ప్రజలు



మొయినాబాద్ గ్రామం

మొయినాబాద్: హైదరాబాద్ నగర శివారుల్లో కొత్త మున్సిపాలిటీ ఏర్పాటు కాబోతుంది. ఔటర్ రింగ్ రోడ్డుకు ఆనుకొని ఉన్న మొయినాబాద్ మండలంలోని ఏడు గ్రామ పంచాయతీలను కలిపి కొత్త మున్సిపాలిటీ ఏర్పాటు చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు ఇప్పటికే ప్రభుత్వానికి అందాయి. ప్రభుత్వం ఆమోదం తెలిపితే ఇక మొయినాబాద్ కొత్త మున్సిపాలిటీగా అవతరించనుంది.

మున్సిపాలిటీల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి

రాష్ట్ర ప్రభుత్వం కొత్త మున్సిపాలిటీల ఏర్పాటుపై మరోసారి దృష్టి సారించింది. ఇటీవలే హైదరాబాద్ నగర శివారుల్లో ఔటర్ రింగ్‌రోడ్డు లోపల ఉన్న కొన్ని మున్సిపాలిటీలను, గ్రామ పంచాయతీల జీహెచ్ఎంసీలోనూ, సమీప మున్సిపాలిటీల్లోనూ విలీనం చేశారు. ఇదే క్రమంలో ఔటర్ వెలుపల అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలను మున్సిపాలిటీలుగా చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే మొయినాబాద్ మున్సిపాలిటీ ఏర్పాటుకు ప్రభుత్వం ముందడుగు వేస్తున్నట్లు సమాచారం.

నగరానికి అతి చేరువగా..

మొయినాబాద్ మండలం హైదరాబాద్ నగరానికి అతి చేరువలో ఉంది. జంట జలాశయాలైన ఉస్మాన్ సాగర్(గండిపేట), హిమాయత్‌సాగర్ పరిసరాల్లో చాలా మంది వీఐపీలు, రాజకీయ, సినీ, ప్యావార రంగాల ప్రముఖులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, మాజీ అధికారులకు సంబంధించిన ఫాం హౌస్‌లు, వ్యవసాయ క్షేత్రాలు ఉన్నాయి. దీంతో ఈ ప్రాంతాన్ని మున్సిపాలిటీగా మార్చాలనే డిమాండ్ వారు నుంచి వస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అందుకు అనుగుణంగానే చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అధికారులతో ప్రతిపాదనలు సిద్ధం చేయించి ప్రభుత్వానికి పంపారు. ఇప్పటికే చేవెళ్ల మున్సిపాలిటీ ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. అయితే మొయినాబాద్ మున్సిపాలిటీ ఏర్పాటుకు సైతం ఎమ్మెల్యే కాలె యాదయ్య తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

ఏడు పంచాయతీలు కలిపి..

కొత్తగా ఏర్పాటు కాబోయే మొయినాబాద్ మున్సిపాలిటీలో ఏడు గ్రామ పంచాయతీలను కలపనున్నారు. అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, ఎనికేపల్లి, చిలుకూరు, పెద్దమంగళారం, మొయినాబాద్, సురంగల్ గ్రామాలను కలిపి మున్సిపాలిటీ చేసేందుకు అధికారులకు ప్రతిపాదనలు పంపారు. ఆయా పంచాయతీల్లో ఎన్ని కుటుంబాలు ఉన్నాయి?, జనాభా ఎంత?, విస్తీర్ణం ఎంత, ఔటర్ నుంచి ఎంత దూరంలో ఉన్నాయి అనే అంశాలను ప్రతిపాదనల్లో పొందుపర్చారు. ఇటీవల ఎమ్మెల్యే యాదయ్య ఈ విషయమై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి లేఖ అందజేశారు. మొయినాబాద్ మున్సిపాలిటీ ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి సైతం సానుకూలంగానే ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రతిపాదిత గ్రామాలు, జనాభా వివరాలు ఇలా..

పంచాయతీ పేరు	జనాభా
మొయినాబాద్	2,516
అజీజ్‌నగర్	4,757
హిమాయత్‌నగర్	3,902
ఎనికేపల్లి	2,395
చిలుకూరు	6,100
పెద్దమంగళారం	4,590
సురంగల్	1,810
మొత్తము	26,070

ప్రతిపాదనలు పంపాం



కొత్త మున్సిపాలిటీ ఏర్పాటుకు పైఅధికారుల సూచన మేరకు ప్రతిపాదనలు పంపాం. మండలంలోని చిలుకూరు, పెద్దమంగళారం, మొయినాబాద్, సురంగల్, ఎనికేపల్లి, అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్ గ్రామ పంచాయతీను కలిపి మున్సిపాలిటీగా ఏర్పాటు చేయడానికి అవసరమైన పూర్తి సమాచారాన్ని ప్రతిపాదనల్లో పంపించాం. ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

– వెంకటేశ్వరరెడ్డి, ఎంపీఓ, మొయినాబాద్

మేలైన పద్ధతులతో అధిక దిగుబడి



రైతు సదస్సులో పాల్గొన్న శాస్త్రవేత్తలు, విద్యార్థులు, రైతులు

చేవెళ్ల: వ్యవసాయంలో రైతులు మేలైన సాగు పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధిస్తారని పలుగుట్ట మాజీ సర్పంచ్ జనార్ధన్‌రెడ్డి, రాజేంద్రనగర్ పూల పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ జ్యోతి, డాక్టర్ ప్రణీత్‌లు అన్నారు. చేవెళ్ల మండలంలోని పలుగుట్ట గ్రామంలో మొజెర్ల కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన కళాశాల విద్యార్థుల క్షేత్ర పర్యటనలో భాగంగా బుధవారం గ్రామంలో రైతు సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు శాస్త్రవేత్తలతో పాటు కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ పూర్ణిమ మిశ్రాలు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎక్కువగా పూలసాగు చేసే రైతులు ఉండటంతో వారికి కావాల్సిన సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. దీంతో పాటు ప్రజలకు, రైతులకు పెరటి తోటల పెంపకం, మిద్దె పంటల సాగు, పుట్టగొడుగుల సాగు, తదితర వాటి గురించి తెలియజేశారు. కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ పూర్ణిమ మిశ్రా మాట్లాడుతూ..రైతులు వ్యవసాధికారుల సలహాలు, సూచనలు పాటించాలని సూచించారు. ఉద్యాన సాగులో మెలకవలు, పద్ధతుల గురించి అవగాహన కల్పించేందుకు వచ్చిన శాస్త్రవేత్తలకు, గ్రామంలో పర్యటిస్తున్న ఉద్యాన కళాశాల విద్యార్థులకు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యాన విద్యార్థులు పవన్ వెంకటేశ్, శ్రీకాంత్, శ్రీవస్‌రెడ్డి, శివసాయి, రాజు, గ్రామస్తులు, రైతులు తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించాలి

- టీయూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ మునీర్‌పాషా



ఆలూరు పాఠశాల వద్ద సభ్యత్వ నమోదులో పాల్గొన్న నాయకులు, ఉపాధ్యాయులు

చేవెళ్ల: డీఎస్సీ 2024 ద్వారా విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులకు వెంటనే వేతనాలు చెల్లించాలని టీయూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ మునీర్‌పాషా డిమాండ్ చేశారు. మండలంలోని ఆలూరు, తంగడపల్లి, ఖానాపూర్, ఈర్లపల్లి, దేవరంపల్లి, కౌకుంట్ల, రేగడిఘనాపూర్ పాఠశాలల్లో బుధవారం టీయూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే డీఎస్సీ నిర్వహించి నూతన ఉపాధ్యాయుల నియామకం చేపట్టిందన్నారు. ఉపాధ్యాయులు విధుల్లో చేరి మూడునెలలు కావొస్తున్నా వారికి ఇప్పటివరకు జీతాలు అందలేదన్నారు. మూడు నెలలుగా వారు నానాఇబ్బందులు పడుతూ ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి వారి జీతాలు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో చేవెళ్ల మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దయానంద్, శివానందం, శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు అంజయ్య, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'మొయినాబాద్'కు చిలుకూరు బాలాజీ పేరుపెట్టాలి

బీజేపీ జిల్లా నాయకుడు గోపాల్‌రెడ్డి

మొయినాబాద్: మొయినాబాద్ మండలంలోని ఏ డు గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీగా ఏర్పా టు చేయొద్దని బీజేపీ జిల్లా నాయకుడు గున్నాల గో పాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మొయినాబాద్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీగా మారిస్తే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. ప్రభుత్వం ఎవరి ప్రయోజనాల కోసం మున్సిపాలిటీ ఏర్పాటు చేస్తోందని ప్రశ్నించారు. ఒకవేళ మున్సిపాలిటీ ఏర్పాటుచేస్తే దానికి చిలుకూరు బాలాజీ పేరుపెట్టాలని డిమాండ్ చేశారు.

సీపీఐ వారోత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వంద వసంతాల ప్రచార వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

చేవెళ్ల: పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పని చేసే సీపీఐ పార్టీ వంద వసంతాల వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలని పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం పార్టీ వంద వసంతాల వేడుకలకు సంబంధించిన ప్రచార వాల్‌పోస్టర్‌ను పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1925లో ఏర్పడిన పార్టీ 99 సంవత్సరాలు పూర్తి చేసుకొని వంద సంవత్సరంలోకి అడుగు పెట్టిందన్నారు. ఈ వేడుకలను ప్రజలందరికీ తెలిసేలా వేడుకగా జరుపుకోవాలని పార్టీ ఆదేశించిందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామగ్రామాన వేడుకలు ఘనంగా జరుపుకోవాలన్నారు. ప్రజలకు తెలిసేలా వాల్‌పోస్టర్లతో ప్రచారం నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి సత్తిరెడ్డి, నాయకులు మంజుల, కృష్ణాగౌడ్, శివ, యాదగిరి, శ్రీకాంత్, మురళీ తదితరులు ఉన్నారు.

అపరిచిత మెసేజ్‌లకు స్పందించొద్దు

ఎస్‌ఐ సత్యనారాయణ



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

శంకర్‌పల్లి: సామాజిక మాధ్యమాల(ఫేక్‌బుక్, ఇన్‌స్టాగామ్, ట్విట్టర్) ద్వారా పరిచయం లేని వ్యక్తుల నుంచి మెసేజ్, కాల్స్ వచ్చినప్పుడు స్పందించొద్దని ఎస్‌ఐ సత్యనారాయణ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థినులు, మహిళలు ఆకతాయిల నుంచి వేధింపులకు గురైతే 1930 నంబర్‌కు కాల్ చేసి, ఫిర్యాదు చేయాలన్నారు. వేధింపుల గురించి ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, పోలీసులు ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

- విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కోశాధికారి రమేశ్



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న బండారి రమేశ్, భక్తులు

షాద్‌నగర్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలని తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కోశాధికారి బండారి రమేశ్ అన్నారు. సంకటహర చతుర్థిని పురస్కరించుకొని బుధవారం సాయిమిత్ర యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు మలగారి సత్యనారాయణ ఆధ్వర్యంలో పట్టణంలోని వినాయక గంజ్‌లో ఉన్న గణపతి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో బండారి రమేశ్, మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ పాల్గొని స్వామివారిని దర్శించుకొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. హిందూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ యాదయ్యయాదవ్, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు ఒగ్గు కిషోర్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, గజవాడ నర్సింలు, శ్రీనివాస్‌గౌడ్, శ్రీధర్, ఆలయ ట్రస్టు సభ్యులు ఓం ప్రకాశ్, మహావీర్, సురేందర్, సుదీప్, షుగన్ చందు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ



షాబాద్: పడిని వెలిగిస్తున్న చల్లా శ్రీరాంరెడ్డి, స్వాములు

మొయినాబాద్‌రూరల్: మానవుడి మనుగడకు ఆధ్యాత్మిక చింతన ఎంతో అవసరమని పీసీసీ అధికార ప్రతినిధి, స్పోక్స్ పర్సన్ గౌరీ సతీశ్, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి భీమ్‌భరత్‌లు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ మోత్కుపల్లి వాణీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్ప మహాపడి పూజను ఘనంగా నిర్వహించారు. గురుస్వామి ఉమాశంకర్ రెడ్డి గణపతి హోమం, కుమారస్వామి పూజతో పాటు అయ్యప్పకు నూతన వస్త్రాలు, పూలు, పండ్లు, నైవేద్యం సమర్పించారు. 18 మెట్లపై కర్పూర హారతిని వెలిగించారు. కపిల్ గురుస్వామి భజన మండలి ఆలపించిన అయ్యప్ప పాటలతో గ్రామంలో వీధులన్నీ మార్మోగాయి. కార్యక్రమంలో స్వాములు, భక్తులు, నాయకులు పాల్గొన్నారు.

కక్కులూర్‌లో..

షాబాద్: మండల పరిధిలోని కక్కులూర్ గ్రామంలో బుధవారం అయ్యప్ప స్వామి మహాపడిపూజ ఘనంగా జరిగింది. స్వాములకు కేసారం మాజీ సర్పంచ్ చల్లా సంధ్యశ్రీరాంరెడ్డి అన్నదానం చేశారు. పడిపూజ వేలం పాటలో మాజీ సర్పంచ్ పాల్గొని రూ.2లక్షల 1వేయికి పడిని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి పుష్పాభిషేకం, భాస్మాభిషేకం, నెయ్యాశేకం, చందనాభిషేకం నిర్వహించారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రత్నం

శంకర్‌పల్లి: రాష్ట్ర అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. బుధవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఆయన మండలంలో ని జన్వాడ, మిర్జాగూడ, ఇంద్రారెడ్డినగర్, పిల్లిగుండ్ల, గోపులారం, దొంతాన్‌పల్లి గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికీ తిరిగి బీజేపీ సభ్యత్వ నమోదు చేయించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి దొరల పాలన కొనసాగిస్తున్నారని, దీనిని వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతోందని, అవి రాష్ట్రంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాములుగౌడ్, మాజీ ఎంపీపీ బీర్ల నర్సింహ, రాజేంద్రసింగ్, బయన్న, శివ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

షాబాద్: పేద ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కుర్వగూడ మాజీ సర్పంచ్ సంధ్యమల్లికార్జున్‌గౌడ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కుర్వగూడ గ్రామంలో చేవెళ్లకు చెందిన పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాల వైద్యులతో వెల్స్‌పన్ ఫౌండేషన్ సీఎస్ఆర్ హెడ్ సురేఖ, మేనేజర్ భద్రయ్యల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 256 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 48 మందికి వారంరోజుల తర్వాత ఆస్పత్రికి తీసుకెళ్లి మెరుగైన వైద్యం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

అమిత్‌షాపై కేసు నమోదు చేయాలి

షాద్‌నగర్‌రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ పట్ల హేళనగా మాట్లాడిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాపై వెంటనే దేశద్రోహ కేసు నమోదు చేయాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి దొడ్డి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. కేంద్ర మంత్రి అమిత్‌షా పార్లమెంట్ సమావేశాల్లో ప్రసంగిస్తూ ఈ మధ్యన అంబేడ్కర్ అనే పదం ఫ్యాషన్ అయిపోయిందని అంబేడ్కర్‌ను అవమానించే విధంగా ప్రసంగించారని పేర్కొన్నారు. అధికార గర్వంతో అమిత్‌షా కళ్లు నెత్తికెక్కాయని, అంబేడ్కర్ దేశాభివృద్ధికి దిక్సూచి అన్నారు. దేశంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా సమాజంలో అలజడి సృష్టించాలనే కుట్రలో భాగంగానే అమిత్‌షా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. అంబేడ్కర్ పట్ల చిన్నచూపుతో మాట్లాడిన అమిత్‌షా తన మాటలను వెంటనే ఉపసంహరించుకొని భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

'బీజేపీ అంబేడ్కర్‌ను గౌరవించింది'

షాద్‌నగర్‌రూరల్: రాజ్యాంగ నిర్మాత బీఆర్.అంబేడ్కర్‌ను ఆనాటి జన సంఘ్ ప్రస్తుత బీజేపీ గౌరవిస్తూ పార్లమెంట్‌కు పంపిందని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎంకనోళ్ల వెంకటేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా గురించి మాట్లాడే నైతిక హక్కు బీఎస్పీ నాయకులకు లేదన్నారు. దేశంలో అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నది బీజేపీ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. అంబేడ్కర్ ఆశయాలు, సిద్ధాంతాలతో పార్టీ ముందుకు సాగుతోందని వివరించారు. బీజేపీ హయాంలోనే పార్లమెంట్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని పెట్టామని, అంబేడ్కర్‌కు భారతరత్న అవార్డును ఇచ్చి ప్రపంచ మేధావిగా గుర్తించిందని గుర్తుచేశారు. అంబేడ్కర్ పేరు చెప్పుకొని ఓటు బ్యాంకు కోసం పనిచేసే బీఎస్పీకి అమిత్‌షాను విర్శించే నైతిక హక్కు లేదన్నారు. పార్టీపై బురద జల్లాలనే ప్రయత్నం మానుకోవాలని, లేని యెడల చరిత్ర హీనులుగా మిగిలిపోతారని పేర్కొన్నారు.